క్లుప్తంగా

పోషకాహారంతో ఆరోగ్యం



మునగపాక సచివాలయంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం

మునగపాక: మునగపాక సచివాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గ్రామస్తుల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సర్పంచ్ అప్పారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు వహించాలన్నారు. అలాగే పోషక విలువలతో కూడిన ఆహారం శ్రేయస్కరమన్నారు. డాక్టర్ సంధ్య మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరంలో వివిధ సమస్యలపై వచ్చిన రోగులను పరీక్షించి, మందులు అందించారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

475 మందికి బ్రాండిక్స్‌లో కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని బ్రాండిక్స్ అపెరల్ సిటీలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 475 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 10 మంది చిన్నారులు కూడా ఉన్నారు. 322 మందికి కళ్లద్దాలు, 88 మందికి మందులు పంపిణీ చేశారు. బ్రాండెక్స్ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా నిర్వహించిన 101వ శిబిరం ఇది. 43 మందికి కేటరాక్ట్ సర్జరీ అవసరమని వైద్యులు సూచించారు. శంకర్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరానికి విచ్చేసిన వారికి మజ్జిగ, ఫలహారం, భోజన సదుపాయం కల్పించారు. కంటి వైద్య శిబిరానికి వచ్చిన రోదులను బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి పరామర్శించారు.

ఘనంగా అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం



అయ్యప్పస్వామి సన్నిధిలో గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్

మునగపాక: మునగపాకలో అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం నిర్మించి మూడేళ్లయిన సందర్భంగా గ్రామస్తులంతా కలిసి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అయ్యప్పస్వామిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. అయ్యప్ప దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఆలయ చైర్మన్ వేగి లక్ష్మణరావు, ఇతర కార్యవర్గ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం భారీగా అన్నసమారాధన చేశారు.

మురుగు గుంతతో విద్యార్థులకు ఇక్కట్లు



పాఠశాల ఎదుట మురుగునీటి నిల్వ

పాయకరావుపేట: మండలంలోని వెంకటనగరం పాఠశాల ఎదుటనున్న మురుగునీటి గుంతతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. పాఠశాల పక్కనున్న రోడ్డు పల్లం కావడంతో స్థానిక నివాసితుల వాడుక నీరు నిలిచిపోతోంది. డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో రోజుల తరబడి మురుగునీరు నిలిచి, దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో దోమలు వృద్ధి చెంది, రోగాలు వ్యాపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల చదువులు, ఆరోగ్యం దృష్ట్యా డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి, మురుగు నీరు నిల్వలేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు నివేదించినట్టు గ్రామ మాజీ సర్పంచ్ చోడిపల్లి శ్రీనివాస్ తెలిపారు. అధికారులు తక్షణం స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఉత్సవ వేళ.. సుగంధ హేల

- సుగంధ ద్రవ్యాలు, మసాలా దినుసుల స్టాళ్లు సిద్ధం
- నెలరోజుల పాటు రూ.1.50 కోట్లు విలువైన అమ్మకాలు
- వెంకన్న సెంటిమెంట్‌గా భావిస్తున్న కొనుగోలుదారులు



ఆలయానికి చెందిన ఖాళీ స్థలంలో ఏర్పాటు చేస్తున్న మసాలా దినుసుల దుకాణాలు

నక్కపల్లి: ఉపమాక వెంకన్న కల్యాణోత్సవాలను పురస్కరించుకుని నెలరోజుల పాటు జరిగే తిరుణాళ్లలో సుగంధ ద్రవ్యాలు, మసాలా దినుసుల వ్యాపారానికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. మార్చి 3వ తేదీన స్వామివారి వార్షిక కల్యాణం అంగరంగ వైభవంగా జరగనుంది. దీనికి సంబంధించి టీటీడీ వారు భారీ స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కల్యాణ ఉత్సవాలు వారం రోజుల పాటు జరుగుతాయి. ఈ వారం రోజులూ ఇక్కడ సంబరాలేనంటే అతిశయోక్తికాదు.

నెల రోజులు తిరుణాళ్లు

కల్యాణోత్సవాల్లో భాగంగా ప్రధాన వేడుకలు వారం రోజులకే ముగిసినా.. నెలరోజుల పాటు అంటే కొత్త అమావాస్య వరకు తిరుణాళ్లు కొనసాగుతాయి. ఈ తిరుణాళ్ల సందర్భంగా ఉపమాకలో మసాలా దినుసుల వ్యాపారం భారీగా జరుగుతుంది. కేవలం ఈ నెల రోజుల్లోనే దాదాపు రూ.1.50 కోట్లు విలువైన సుగంధ ద్రవ్యాల వ్యాపారం జరుగుతుందని అంచనా. ఉభయ గోదావరి జిల్లాలు, ఏజెన్సీ, శ్రీకాకుళం, విశాఖపట్నం, అనకాపల్లి, నర్సీపట్నం తదితర ప్రాంతాల నుంచి బడా వ్యాపారులు ఇక్కడకు వస్తారు. ప్రత్యేకంగా పాకలు, తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసి హోల్‌సేల్ దుకాణాలు తెరుస్తారు.

కొనుగోళ్లకు వెంకన్న సెంటిమెంట్

ఈ మసాలా దినుసుల వ్యాపారానికి సెంటిమెంట్ కూడా ఉంది. స్వామివారి కల్యాణోత్సవాలను తిలకించేందుకు రాష్ట్ర నలుమూలలనుంచి లక్షలాది మంది తరలి వస్తారు. ఉత్సవాల నుంచి తిరుగుముఖం పట్టేటపుడు చాలా మంది ఏడాదికి సరిపడా సరుకులు వెంటతీసుకెళ్తుంటారు. ఉపమాక వెంకన్న సన్నిదిలో లభించే ఈ సరుకులు కొనుగోలు చేసి ఏడాది పొడవునా తమ ఇళ్లల్లో జరిగే వివాహాది శుభకార్యాల్లో వినియోగిస్తారు. వెంకటేశ్వర స్వామి తిరుణాళ్లలో కొనుగోలు చేసిన ఈ సరుకులను ఉపయోగిస్తే అనారోగ్య సమస్యలు ఉండవని భక్తుల నమ్మకం.

వెంకన్న పెళ్లి తర్వాతే వివాహ ముహూర్తాలు

ఈ ప్రాంత వాసులకు మరో సెంటిమెంట్ కూడా ఉంది. ఉపమాక వెంకన్న కల్యాణం జరిగిన తర్వాతే ఈ ప్రాంతాల్లో వివాహాలకు ముహూర్తాలు నిర్ణయిస్తారు. తమ పిల్లలకు వివాహాలు చేస్తారు. వెంకన్న కల్యాణం లోపు ఇక్కడ పెద్దగా హైందవ కుటుంబాల్లో వివాహాలుండవు. కల్యాణ సమయంలో ముహూర్తాలు నిర్ణయించిన వారు ఇక్కడి నుంచే సరకులు కొనుగోలు చేసుకుని వెళ్తారు. ఈ దుకాణాల కోసం ఆలయానికి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో నాలుగు రోజుల నుంచి పెద్ద పెద్ద పాకలు, షెడ్లు వేసే కార్యక్రమం జరుగుతుంది. మార్చి 3 నుంచి ఈ దుకాణాల్లో అమ్మకాలు ప్రారంభమవుతాయి. అదే రోజు స్వామివారి కల్యాణం కూడా జరగనుంది.

అ'పూర్వ' సమ్మేళనం



కశింకోట డీపీఎన్ జెడ్పీ హైస్కూల్ 1973-74 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



భగీరథమ్మ గుడి వద్ద 1992-93 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

కశింకోట: ఒకప్పుడు వారంతా పదో తరగతి కలిసి చదువుకున్నారు. పది, పాతికేళ్లు కాదు.. ఏకంగా అర్ధ శతాబ్దం తర్వాత కలిశారు. ఏ ఒక్కరు కూడా గతాన్ని నెమరువేసుకుని, పలకరిద్దామన్నా.. రూపురేఖలు గుర్తుపట్టలేని విధంగా వయసు దాటేసింది. ఈ వయసులో అప్పటి ఆనవాళ్లు కూడా మరుగునపడ్డాయి. చాలా మందికి మనవలు, మనవరాళ్లు కూడా ఇపుడు పదోతరతి దాటేశారు. అలాంటి వారంతా ఒక్కొక్కరుగా పరస్పరం కొత్తగా పరిచయం చేసుకుని మరీ.. తమ చిన్ననాటి స్మృతుల్ని నెమరువేసుకున్నారు. తామంతా షష్టిపూర్తి వయసు అధిగమించేశామన్న విషయం కూడా వారికి గుర్తురానంతగా కేరింతలు కొట్టారు. అప్పట్లో చేసిన చిలిపి పనుల్ని గుర్తున్న మేరకు.. గుర్తు చేసుకుని మరీ.. ఒకర్ని ఒకరు ఆటపట్టించుకున్నారు. అలాంటి అపురూప సంబరాలకు స్థానిక డీపీఎన్ జిల్లాపరిషత్ హైస్కూల్ వేదికయింది. ఈ స్కూల్లో 1973-74 బ్యాచ్‌కు చెందిన టెన్త్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. హైదరాబాద్, మహారాష్ట్రలోని నాగపూర్ తదితర సుదూర ప్రాంతాల్లో స్థిరపడిన వారితో సహా స్థానిక పూర్వ విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. ఒరేయ్ మీ పిల్లలు ఎలా ఉన్నారు.. ఏం చేస్తున్నారంటూ.. కుటుంబ యోగక్షేమాలు తెలుసుకున్నారు. సహపంక్తి భోజనాలు చేశారు. అంతా కలిసి ఫోటోలు దిగారు. తమకు చదువు చెప్పిన సైన్స్ ఉపాధ్యాయురాలు జానకి, ఉపాధ్యాయుడు కాశీనాయుడులను సత్కరించారు. తమ సహ విద్యార్థి రఘుమణి ఆర్థిక పరిస్థితి తెలుసుకుని, ప్రతి నెలా కొంత సాయం అందించి, అండగా నిలవాలని నిర్ణయించారు. తమతో చదువుకున్న పూర్వ మహిళా విద్యార్థులకు పసుపు, కుంకుమలతో చీరలు బహూకరించి గౌరవించారు. పూర్వ విద్యార్థులు డి. ధర్మరాజు, ఉజ్జి సూర్యమల్లేశ్వరరావు తదితరులు ఈ సమ్మేళన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అచ్యుతాపురం(అనకాపల్లి) : వారంతా 30 ఏళ్ల క్రితం పదో తరగతి చదువుకున్న విద్యార్థులు. ఆదివారం ఒకే చోట కలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. మునగపాక ఉన్నత పాఠశాలలో 1992-93 బ్యాచ్‌కు చెందిన టెన్త్ విద్యార్థులు అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం భగీరథమ్మ గుడి వద్ద ఆదివారం కలుసుకుని సరదాగా గడిపారు. జనపరెడ్డి ఆదినారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కలయికలో ఆ బ్యాచ్ విద్యార్థులు పాల్గొన్నారు.

4న గౌరీశంకరుల ఉత్సవం



గౌరీశంకరుల ఆలయం

పాయకరావుపేట: మండలంలోని సత్యవరం గ్రామంలో మార్చి 4న శ్రీ గౌరీశంకరుల మహోత్సవం(తిరుణాళ్లు) నిర్వహించనున్నట్టు ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలతో ప్రారంభమై మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించి, పలు సాంస్కృతి కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు.

నిరంకారిబాబా భక్తుల స్వచ్ఛ సేవ



గవరపేటలో శారదానది మెట్ల ప్రాంతాన్ని శుభ్రపరుస్తున్న నిరంకారి బాబా భక్తులు

కశింకోట : స్థానిక గవరపేటలో వెలసిన శారదా గణపతి రామాలయం, శారదానది ప్రాంతాన్ని ఆదివారం నిరంకారి బాబా భక్తులు శుభ్రపరిచారు. సంత్ నిరంకారి మిషన్ వారి అమృత్ ప్రాజెక్టులో భాగంగా స్వచ్ఛ జల్, స్వచ్ఛ మాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని, నదికి వెళ్లే మెట్ల మార్గాన్ని చెత్తా, చెదారం తొలగించి తుడిచి శుభ్రం చేశారు. నిరంకారి బాబా భక్తులు పాల్గొన్నారు.

119వ రోజుకు నేవీ నిర్వాసితుల ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న నేవీ నిర్వాసితులు

రాంబిల్లి: నేవీ నిర్వాసితులు, నేవీ ప్రభావిత గ్రామాల ప్రజలు ఆదివారం ధర్నా కొనసాగించారు. తమ డిమాండ్లు నెరవేర్చాలంటూ 119 రోజులుగా ఈ ధర్నా చేస్తున్నారు. ప్రభుత్వం రూపొందించిన మినిట్స్‌పై పూర్తిస్థాయిలో సానుకూలత లేకపోవడంతో ఆందోళన కొనసాగిస్తున్నారు. జీవన భృతి 10 నెలల కాలానికి నెలకు రూ.13 వేలు చొప్పున వాడనర్సాపురం, కొత్తపట్నం గ్రామాల ప్రజలకు ఇస్తామని మినిట్స్‌లో నమోదు చేసారు. అయితే తమకు నేవీ సెకెండ్ ఫేజ్ నోటిఫికేషన్ వచ్చేవరకు ఈ జీవన భృతి ప్యాకేజీ ఇవ్వాలని వాడనర్సాపురం, కొత్తపట్నం గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అనకాపల్లి సుగర్స్ పరిరక్షణకు కృషి

రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం



అనకాపల్లి సుగర్ ఫ్యాక్టరీ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం

అనకాపల్లి రూరల్ : ఎంతోమంది రైతులు, కార్మిక కుటుంబాలకు జీవనాధారమైన అనకాపల్లి సుగర్ ఫ్యాక్టరీని లిక్విడేషన్ నుంచి ప్రభుత్వం కాపాడాలని అఖిల పక్ష రాజకీయ, ప్రజా రైతు సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు కోరారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సభలో వ్యవసాయదారుల సంఘం ఉపాధ్యక్షుడు విల్లూరి పైడారావు, సీపీఐ నాయకుడు వైఎన్ భద్రం, సీపీఎం నేత బాలకృష్ణ, ఏపీ చెరకు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కర్రి అప్పారావు, జనసేన నాయకుడు శ్రీరామదాస్ గోవింద్ మాట్లాడారు. సుగర్ ఫ్యాక్టరీని పరిరక్షించుకోవడం కోసం ఐక్యంగా పోరాటం చేయాలని తీర్మానించారు. ఈ ఫ్యాక్టరీని ఆధునికీకరించి, చెరకు క్రషింగ్ జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందులో సీపీఐ నాయకులు దొరబాబు, కోన లక్ష్మణ్, సీపీఎం నాయకులు గంటా శ్రీరామ్, చెరకు రైతు సంఘం నాయకులు కోరిబిల్లి శంకరరావు, దూలం గోపి, మళ్ల శ్రీను, బొడ్డేడ అప్పారావు, బట్ట చిన్నియాదవ్, ఆళ్ల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఈ కేవైసీ నమోదు

- సబ్ డివిజన్‌లో 97.3 శాతం పూర్తి
- ఈ కేవైసీ తుది గడువు ఈ నెల 28

అనకాపల్లి రూరల్ : ఈ ఏడాది రబీలో పంటలకు సంబంధించి ఈ కేవైసీ నమోదు ప్రక్రియ జోరుగా జరుగుతోంది. అనకాపల్లి వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఇప్పటివరకు 97.3 శాతం పంటలకు ఈ కేవైసీ పూర్తి చేసినట్టు గణాంకాలు చెబుతున్నాయి. సబ్ డివిజన్ పరిధిలో అనకాపల్లి, మునగపాక, కశింకోట మండలాలున్నాయి. మొత్తం 4778 మంది రైతులు, 4028 ఎకరాల విస్తీర్ణంలో వివిధ పంటలు సాగు చేశారు. అనకాపల్లి మండలంలో 96 శాతం, మునగపాకలో 98 శాతం, కశింకోటలో 98 శాతం ఈ కేవైసీ పూర్తి చేశారు. ఈ క్రాప్ మాత్రం 100 శాతం పూర్తయినట్టు అధికారులు తెలిపారు. తొలుత ప్రభుత్వం ఈ కేవైసీ నమోదుకు ఈ నెల 25 వరకు గడువు ఇవ్వగా మిగిలిన రైతులు నష్టపోకుండా 28 వరకూ గడువును పొడిగించింది. ఈ కేవైసీ నమోదు చేసుకోని రైతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే ప్రయోజనాలు కోల్పోతారని వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు. అందుకే ఈ కేవైసీ నమోదు అధికార యంత్రాంగంతో పాటుగా రైతులు కూడా తమ సమష్టి బాధ్యతగా తీసుకోవాలని అనకాపల్లి మండల వ్యవసాయాధికారి పీయూటీపీ రంగాచారి కోరుతున్నారు. కొద్దిమంది రైతులకు సంబంధించి మాత్రమే ఈ కేవైసీ నమోదు పూర్తి కాలేదు. మృతి చెందిన రైతులు, వేలి ముద్రలు నమోదు కాని రైతుల సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం వారి కుటుంబ సభ్యుల్లో ఒకరి ఆధార్ కార్డుతో ఈ కేవైసీ నమోదు చేసుకునే అవకాశం కల్పించింది.

ఈ కేవైసీ గడువు దగ్గర పడుతుండడంతో రైతుల కోసం సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆర్బీకేల్లోనే అందుబాటులో ఉంటున్నారు. ఆధార్‌తో మొబైల్ నంబరు లింక్ అయిన రైతులు తాము ఎక్కడ ఉన్నా ఓటీపీ ద్వారా ఈ కేవైసీ నమోదు చెసుకునే అవకాశం ఉంది.

యువగళం పాదయాత్రకు స్పందన - యనమల

నక్కపల్లి: యువగళం పాదయాత్రకు విశేష స్పందన లభిస్తోందని మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. ఆదివారం నక్కపల్లిలో పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కష్టపడి పనిచేస్తే విజయం తమదేనన్నారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందడం లేదన్నారు. కార్యకర్తలు ఐకమత్యంగా ఉండి పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. పార్టీకి సైనికుల వంటి కార్యకర్తలు ఉన్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అనిత, పార్టీ అధ్యక్షుడు వెంకటేష్, సీనియర్ నాయకులు కె.నూకరాజు, తాతారావు, డి.సత్యనారాయణ, రాఘవులు పాల్గొన్నారు.

కమ్మేసిన పొగమంచు

రాంబిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం పొగమంచు కమ్మేసింది. ఉదయం 9 గంటల వరకు మంచు తెరలు వీడలేదు. రోడ్లపై వాహనాల్లో రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడ్డారు. పొగమంచు ప్రభావంతో అపరాలు పంటలకు నష్టం కల్గుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంచు వీడిన తర్వాత ఎండ ప్రభావం తీవ్రంగా కనిపించింది.

పబ్లిక్ విభాగం అధ్యక్షుడికి సత్కారం



పబ్లిక్ వింగ్ అధ్యక్షుడు సాయిబాబాను సత్కరిస్తున్న మంత్రి అమర్‌నాథ్

పాయకరావుపేట: వైఎస్సార్‌సీపీ జిల్లా పబ్లిక్ విభాగం అధ్యక్షుడిగా నియమితులైన దగ్గుపల్లి సాయిబాబా ఆదివారం రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సాయిబాబాకు శాలువా కప్పి మంత్రి సత్కరించారు. పార్టీ విజయానికి అందరూ కృషి చేయాలని మంత్రి చెప్పారని సాయిబాబా తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్, పలువురు నాయకులు వున్నారు.

ఎమ్మెల్సీ గెలుపే లక్ష్యంగా కృషి

ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్

మునగపాక: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ విజయం కోసం ప్రతీ ఒక్కరూ శక్తి వంచన లేకుండా కృషి చేయాలని ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ పరిపాలనా రాజధానిగా త్వరలో ప్రకటన రానుందన్నారు. తద్వారా ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింతగా పెరుగుతాయన్నారు. వచ్చే నెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటును సుధాకర్‌కు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీ శ్రేణులు కూడా ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధిపై ప్రచారం నిర్వహించి సుధాకర్ విజయాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా అందించాలని సూచించారు. సమావేశంలో మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మళ్ల సంజీవరావు, సచివాలయ కన్వీనర్లు బొడ్డేడ అప్పలనాయుడు, గుంట్ల అప్పారావు, టెక్కలి కొండలరావు, పార్టీ నేతలు పల్లె అప్పలనాయుడు, చదరం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారి ఆలయంలో భక్తులు, నూతన దంపతులు

మాడుగుల: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయానికి ఆదివారం భక్తుల తాకిడి పెరిగింది. విశాఖ, తుని, రాజమహేంద్రవరం, అనకాపల్లి, నర్సీపట్నం పట్టణాలతోపాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. దాంతో ఆలయ ప్రాంగణంలో పండగ వాతావరణం నెలకొంది. కొత్తగా వివాహం చేసుకున్న 50 జంటల వరకు వారి బంధువులతో అమ్మవారిని దర్శించుకున్నారు. అదేవిధంగా గ్రామానికి చెందిన భక్తులు వీధి పండుగలు నిర్వహించడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా ప్రత్యేకంగా కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, కమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వైద్యసేవలు సద్వినియోగపరచుకోండి



వైద్య శిబిరంలో రోగులతో మాట్లాడుతున్న డాక్టర్ బంగారయ్య

ఎస్.రాయవరం: ప్రముఖ వైద్యులు అందుబాటులోనికి వచ్చినప్పుడు వైద్య సేవలు సద్వినియోగపరచుకోవాలని బీబీఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ బంగారయ్య అన్నారు. అడ్డురోడ్డులో ఆదివారం మెగా వైద్య శిభిరం నిర్వహించారు. ఎస్.రాయవరం, నక్కపల్లి, కోటవురట్ల మండలాల నుంచి 746 మంది రోగులు హాజరయ్యారు. విశాఖపట్నం నుంచి గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీ, బీపీ, షుగర్ తదితర వ్యాధులకు వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమానికి కాపు కార్పొరేషన్ డైరక్టర్ వీసం రామకృష్ణ, స్థానిక సర్పంచ్ కర్రి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా సుధాకర్‌ను గెలిపించాలి



మామిడివాడలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాంబిల్లి: వైఎస్సార్‌సీపీ తరపున ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని పార్టీ నాయకులు ఆదివారం మామిడివాడ, నారాయణపురం, కలవలాపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి పట్టభద్రులను కలిసి, మొదటి ప్రాధాన్యతా ఓటు సీతంరాజు సుధాకర్‌కే వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నెట్టెం సత్యన్నారాయణ, ఎస్.సన్యాసిరావు, కె.నాగరాజు, కె.వెంకటరావు, ఎం.రాఘవేంద్ర పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బల్లల పండగ



బల్లల పండగలో శక్తి వేషాలు

నక్కపల్లి: మండల కేంద్రం నక్కపల్లి, ఉపమాక తదితర గ్రామాల్లో రజకులు ఆదివారం బల్లల పండుగను ఘనంగా నిర్వహించారు. ఏటా సంక్రాంతి అనంతరం రజకులు ఈ బల్లల పండగను చేసుకోవడం ఆనవాయితీ. ఈ పండగ నిర్వహిస్తే తప్ప వారు తమ చేతి వృత్తిని కొనసాగించే పరిస్థితి ఉండదని నమ్మకం. ఈ సందర్భంగా శక్తి వేషాలు, నేల డ్యాన్సులు చేస్తూ భారీ ఊరేగింపు నిర్వహించారు. రైతులు, వ్యాపారులు, తమకు తోచిన రీతిన కానుకలు, విరాళాలు అందించారు.

నూకాంబిక అమ్మవారి దర్శనం ప్రారంభం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



అమ్మవారి మూలవిరాట్

అనకాపల్లిటౌన్ : ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి గవరపాలెం నూకాంబిక అమ్మవారి గర్భగుడి దర్శనం ఆదివారం నుంచి భక్తులకు కల్పించినట్టు ఆలయ ఈవో చంద్రశేఖర్ చెప్పారు. ఈ నెల 22 నుంచి 25 వరకు కొత్త అమావాస్య జాతరను పురస్కరించుకుని అమ్మవారి మూలవిరాట్‌కు రంగులు వేశారు. దీంతో దర్శనాలను నిలిపేశారు. పనులు పూర్తి కావడంతో దర్శనాలకు అనుమతించారు. ఆదివారం అమ్మవారికి ప్రీతిపాత్రమైన రోజు కావడంతో అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్టు ఈవో తెలిపారు.

నూకాంబిక ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



కొత్త అమావాస్య ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ వేగి వెంకటఅప్పారావు

కశింకోట : స్థానికంగా ప్రసిద్ధి చెందిన నూకాంబిక అమ్మ వారి కొత్త అమావాస్య ఉత్సవాల గోడపత్రికను ఆదివారం ఆవిష్కరించారు. వేగి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గంగదేవిపేటలో జరిగిన కార్యక్రమంలో విజయనగరం డీఎస్పీ వేగి వెంకటఅప్పారావు చేతుల మీదుగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. మార్చి 19 నుంచి మూడు రోజులపాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు.